విలేకరుల సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

జెసి ప్రభాకర్ రెడ్డి విమర్శలను ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి - అనంతపురం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్‌పై జె.సి. ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. ఆదివారం స్థానికగణేనాయక్ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి. రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల రంగయ్య మాట్లాడారు. గత వైసీపీ పాలనలో కార్మిక సమస్యలపై తాడిపత్రిలో సిపిఎం చేసిన చేసిన పోరాటాల్లో జేసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ కి ఎదురొడ్డి తాడిపత్రి నియోజకవర్గంలో 8 ఎంపిటీసీలు, ఒక జెడ్ పి టీ సి, ఒక మున్సిపల్ కౌన్సిలర్ స్థానానికి సిపిఎం పోటీ చేసిందని గుర్తు చేశారు. అంతేకాకుండా గత పాలనలో తాడిపత్రి లో జరిగిన అన్ని తప్పుడు పద్దతులను ఎప్పటికప్పుడు వ్యతిరేకించింది సిపిఎం అని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ దంపతులకు ఒకటిన్నర సెంటు ఇల్లు, వెయ్యి రూపాయల బ్యాంకు అకౌంట్ తప్ప ఎలాంటి భూమి, డబ్బు లేదన్నారు. ఎవైనా ఎక్కడున్నా జేసీ ప్రభాకర్‌రెడ్డే వాటిని దానం చేయాలన్నారు. శనివారం ఓ టీవీ ఛానల్ చర్చలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ మాట్లాడిన అంశంపై జె.సి. ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలో ఎవరున్నా ప్రజల తరపున పోరాడడం, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదిరించడం సిపిఎం విధానమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప స్పష్టం చేశారు. గతంలో పెద్దారెడ్డి జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వచ్చి దౌర్జన్యం చేసినప్పుడు అందరికంటే ముందు విమర్శించింది అప్పటి సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అనే విషయం గుర్తించాలన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ తరుపున కూడా ఆరోజు ఖండించడమే కాకుండా జిల్లాలోని వామపక్ష పార్టీలు కలిసి వైసీపీ ని విమర్శించాయని గుర్తు చేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలను పోటీ చేయనీయకుండా వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంటున్న సమయం లో తాడిపత్రి నియోజకవర్గం లో పెద్దవడుగూరు జెడ్ పి టి సి, తాడిపత్రి రూరల్, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో ఎనిమిది ఎంపిటీసీలకు సిపిఎం పోటీ చేసిందని గుర్తు చేశారు. తాడిపత్రి మున్సిపాల్టీ లో కౌన్సిలర్‌గా సిపిఎం తరుపున పోటీ చేసిన అభ్యర్థి భర్తను ఎన్ని రకాలుగా బెదిరించినా పోటీ నుండి తప్పుకోని విషయం జేసీ ప్రభాకర్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. మునిసిపాలిటీ, అంగన్వాడీ, ఆశ కార్మికులు చేసిన పోరాటాల్లో రాంభూపాల్ తో కలిసి జేసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్న విషయం తాడిపత్రి కార్మికులు, ప్రజలు మరచిపోలేదని అన్నారు.. వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం మేడే సందర్భంగా తాడిపత్రి లో పెద్ద ప్రదర్శన చేస్తే జేసీ ప్రభాకర్‌రెడ్డి రాంభూపాల్ తో కలిసి పాల్గొన్నారని 'అప్పుడు మీతో మ్యాచ్ పిక్సింగ్ అయినట్లా?' అని ప్రశ్నించారు. ఫిక్సింగుల అలవాటు సిపిఎం కు వుండదని ఆధారాలుంటే బయట పెట్టాలని సవాల్ విసిరారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న చట్టబద్ధంగా ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రజా సమస్యలు పరిష్కరించాలని, జిల్లా అభివృద్ధి కావాలని పోరాడటమే సిపిఎం విధానమని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ తాము గతంలో ఏమి చేసామో మీకు గుర్తు లేకపోయినా ఈ సంవత్సరం జనవరి 1న తాడిపత్రిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి నిర్వహించిన మహిళ కార్యక్రమం పై వారి మిత్రపక్షం బీజేపీ విమర్శించినప్పుడు వారి పార్టీ కంటే ముందుగా ఖండించింది తామేనని గుర్తు చేశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు అనంతపురంలో జేసీ కుటుంబానికి చెందిన బస్సు తగులబడితే సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని జిల్లా పోలీసు అధికారులను కోరింది సిపిఎంగా తామేనని అన్నారు. ఎవరిపై వ్యక్తిగతంగా మాట్లాడే స్వభావం తమకు లేదన్నారు. తన ఆస్తుల వివరాలను బయటపెడతామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నానని అన్నారు. తనతో పాటు, తన భార్య బ్యాంకు, ఆధార్ కార్డు వివరాలు పంపుతున్నానని, ప్రస్తుతం నివాసం వున్న ఒకటిన్నర సెంట్ ఇల్లు తప్ప తమ పేరుతో భూ మండలంలో ఎక్కడైనా ఎలాంటి ఆస్తి వున్నా, బ్యాంకులో వెయ్యి రూపాయల కు మించి డబ్బులు వున్నా వారికి ఇష్టం వచ్చిన వారికి దానం చేసుకోవచ్చని అన్నారు.

విద్యార్థులకు 'కార్పొరేట్' వల

- అడ్మిషన్ల వేట షురూ
- రాయితీల పేరుతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్న విద్యా సంస్థలు
- తల్లిదండ్రులకు ఫోన్లు, ఎస్ఎంఎస్‌లు
- కళాశాలల్లో ఎన్నో ప్రత్యేకతలంటూ ప్రచారం

కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు వల వేస్తున్నాయి. గత నెల నుంచే ఎల్‌కెజి, నర్సరీ తరగతులకు అడ్మిషన్ల కోసం టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌లకు లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో టీచర్లు ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ల కోసం వెంట పడుతున్నారు. జూనియర్ కళాశాలల ప్రతినిధులు ఏకంగా గ్రామాల్లో మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల ప్రత్యేకతలను వివరిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు,కార్పొరేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల నెంబర్లు సేకరించి మొబైల్ ఫోన్లకు ఎస్ఎంఎస్‌లు, ఫోన్లు చేస్తూ ఊదరగొడుతున్నారు. ఎలాగోలా బుట్టలో వేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం గతంలో పదో తరగతి ఫలితాల అనంతరం అడ్మిషన్ల కోసం కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు తమ సిబ్బందికి లక్ష్యాలు విధించి అడ్మిషన్లు సేకరిస్తుంటాయి. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. అడ్మిషన్ రిజర్వ్ చేసుకుంటే రాయితీలిస్తామని ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు చెబుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 319 ఇంటర్ జూనియర్ కాలేజీలున్నాయి. ఇందులో శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రభుత్వ, కెజిబివి, మోడల్ కళాశాలలు 70, ప్రయివేటు కళాశాలు 42 మొత్తం 112 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. రెండేళ్లుగా జూనియర్ ప్రభుత్వ కాలేజీలలో ఫలితాలు తలకిందులైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆర్థిక పరిపుష్టత లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులు యోచిస్తున్నారు.. దీనిని క్యాష్ చేసుకునేందుకు కార్పొరేట్, ప్రయివేటు కాలేజీల నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. విద్యార్థులను ఎలాగైనా తమ కళాశాలలో చేర్చుకునేందుకు ఇంటింటా ఫోన్, ఎస్ఎంఎస్‌ల ద్వారా అప్పుడే ప్రచారం మొదలు పెట్టారు. బుట్టలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమ కళాశాలలో ఉత్తమ బోధనతో పాటు ఫలానా ప్రత్యేకతలు ఉన్నాయని, చేరితే రాయితీలు ఇస్తామని ఊదరగొట్టేస్తున్నారు. విద్యార్థుల చిరునామా, ఫోన్ నెంబర్లను ప్రయివేటు సంస్థల ప్రతినిధులు.. ఆయా పాఠశాలల నుంచి ఇప్పటికే సేకరించారు. ఆ విద్యార్థి మార్కులు, కుటుంబ ఆర్థిక స్థోమతను తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రయివేటు విద్యాసంస్థల ప్రతినిధులు స్థానికంగా నియమించుకున్న మధ్యవర్తుల ద్వారా నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళుతున్నారు. తమ కళాశాలలో చేర్పితే ఫీజు రాయితీ ఇస్తామని, సౌకర్యాలు కల్పిస్తామని, పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని ఊదరగొడుతున్నారు. మరో వైపు ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు.

ఎవరి డప్పు వారిది..

హిందూపురం, అనంతపురంతో పాటు విజయవాడ, విశాఖపట్నం విద్యాసంస్థలు ప్రత్యేకంగా మధ్యవర్తులను నియమించుకుని, వారి ద్వారా ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తమ సంస్థలు ఉన్నాయని, జిల్లాలోనే కళాశాల శాఖ ఉందని, అందులో చేరాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రయివేటు కళాశాలలు కూడా విద్యార్థులపై వల వేస్తున్నాయి. ఈ ప్రచారంలో తమ కళాశాలలో ప్రత్యేకంగా ఎంసెట్, ఎఐఇఇఇ, జెఇఇ మెయిన్స్, ఎన్ఐటి శిక్షణ ఇస్తామని, పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నారు.

యథేచ్ఛగా రేషన్ తరలింపు

చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండంలో పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 34 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాల నుంచి ప్రతినెలా సుమారు 30 నుంచి 40 టన్నుల రేషన్ బియ్యం సరిహద్దులు దాటుతున్నట్లు సమాచారం. స్థానికంగా ఉన్న కొందరు డీలర్లు బియ్యం సరఫరా చేసే వ్యాపారులతో చేతులు కలిపి విక్రయించుకుంటున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. మండలంలో రేషన్ బియ్యాన్ని రూ.15కు కొని బయటి వ్యక్తులకు రూ.25 వరకూ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై సిఎస్‌డిటి రాజాను వివరణ కోరగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా తరలి వెళ్తున్న రేషన్ బియ్యం

హెలికాప్టర్ ఘటనలో 10 మంది అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా హెలికాప్టర్ వద్ద చోటు చేసుకున్న అంశంపై అరెస్టుల పర్వం ప్రారంభమైంది. ఏప్రిల్ ఎనిమిదవ తేదీన సత్యసాయి జిల్లా రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వచ్చారు. ఆ సందర్భంగా పెద్దఎత్తున వైసిపి శ్రేణులు హెలిప్యాడ్‌లోకి దూసుకొచ్చారు. ఈ సమయంలో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతింది. దీంతో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో తీసుకెళ్లడానికి పైలెట్లు నిరాకరించడంతో ఆయన రోడ్డు మార్గంలో బెంగళూరుకు వెళ్లారు. భద్రతా వైఫల్యంతోనే ఇది జరిగిందని వైసిపి పెద్దఎత్తున ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. నిర్వాహకులుగానున్న వైసిపి రాప్తాడు సమన్వయకర్త అయిన తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డితోపాటు, రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి వైసిపి నాయకులపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో పైలెట్లకు సైతం పోలీసులు నోటీసులిచ్చారు. కో పైలెట్ విచారణకు వెళ్లగా పైలెట్ మాత్రం ఇప్పటి వరకు హాజరవలేదు. ఇది నడుస్తున్న క్రమంలో రామగిరి సర్కిల్ పరిధిలోని పోలీసులు కేసులు నమోదైన పది మంది వైసిపి నాయకులను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోసం గాలింపు చేపట్టారు.

అరెస్టు చూపించాలి : వైసిపి నాయకులు

వైసిపి నాయకులను అరెస్టు చేసిన విషయం తెలియగానే మాజీ మంత్రి, సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, మాజీ ఎంపీ గోరంట్ల మాధమ్ చెన్నేకొత్తపల్లి పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అరెస్టు చేసిన తమ నేతలను 41 సిఆర్‌పిసి నోటీసు ఇచ్చి విడుదల చేయాలని డిమాండ్ చేశారు .ఈ నేపథ్యంలో అరెస్టు చేసిన వారిని శనివారం సాయంత్రం కోర్టులో హాజరుపరచగా వారికి న్యాయమూర్తి బెయిల్ ఇచ్చారు.

వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై కుట్ర పన్నారు : మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి భద్రత విషయంలో కుట్ర జరిగిందని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన చెన్నేకొత్తపల్లిలో మీడియాతో మాట్లాడారు. పోలీసులు చంద్రబాబునాయుడు కబంధ హస్తాల్లో చిక్కుకున్నారని విమర్శించారు. తప్పుడు కేసులు పెట్టి వైసిపి నాయకులను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోసం గాలింపు
కేసులతో కట్టడి చేయలేరు : వైసిపి

ఇప్పుడు వారు పెట్టిన తప్పుడు కేసు ప్రకారమైన 41 సిఆర్‌పిసి నోటీసు ఇచ్చి బెయిల్ ఇవ్వవచ్చునన్నారు. అయితే అది చేయకుండా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముమ్మాటికి అది పోలీసు భద్రతా వైఫల్యమే : ఉషశ్రీ చరణ్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాపిరెడ్డిపల్లి పర్యటనలో చోటు చేసుకున్న ఘటనల్లో ముమ్మాటికి పోలీసు భద్రతా వైఫల్యం ఉందని ఉషచరణ్ శ్రీ ఆరోపించారు. తగినంతగా భద్రతా చర్యలు తీసుకోకపోవడం వలన హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతిందన్నారు. దాన్ని కప్పిపుచ్చుకోవడంలో భాగంగా వైసిపి శ్రేణులపై కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇటువంటి కేసులకు భయపడబోమని చెప్పారు. మరింత గట్టిగా పనిచేస్తారని చెప్పారు. ఎల్లకాలం కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండదని అన్నారు. తమ ప్రభుత్వం కూడా వస్తుందని తెలిపారు. తాము వారిలాగా రెడ్‌బుక్‌లు ఉండవని గుడ్‌బుక్ లే తమ వద్ద ఉంటాయని చెప్పారు.

'భగీరథ' స్ఫూర్తితో ముందుకు..

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం-భగీరథ మహర్షి జయంతి కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం

భగీరథ మహర్షిని స్ఫూర్తిగా తీసుకుని సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు కంకణం కట్టుకున్నారని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగీరథుడు కేవలం ఉప్పర కులస్తులకు మాత్రమే దైవం కాదని.. ఏ పని తలపెట్టిన ఆయన పూర్తిగా నిలిచే దైవమన్నారు. భువి నుంచి దివికి గంగను తీసుకొచ్చేందుకు భగీరథుడు చేసిన కృషి చరిత్రలో ఎప్పటికీ నిలిచే ఉంటుందన్నారు. లక్ష్య సాధనలో ఆయన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్లో కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం భగీరథ ప్రయత్నంలా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, అధికారులు, ఉప్పర, సగర సంఘం నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్

పద్మభూషణుడికి ఘనంగా పౌర సన్మానం

బాలకృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు, సినీ హీరో నందమూరి బాలకృష్ణను కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిన నేపథ్యంలో ఆదివారం రాత్రి బాలకృష్ణకు పట్టణంలోని ఎంజీఎం పాఠశాల మైదానంలో ఘనంగా పౌర సత్కార సన్మాన కార్యక్రమం జరిగింది. దీనికన్నా ముందు శ్రీకంఠాపురం నుంచి సభా వేదిక వరకు నందమూరి బాలకృష్ణ తన సతీమణి వసుంధర దేవి గుర్రపు బండిలో ఊరేగింపుగా చేరుకొన్నారు. సభ ప్రాంగణానికి వచ్చిన బాలయ్యకు మంత్రి సవితమ్మతో పాటు ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు సన్మానించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి బాలకృష్ణ డైలాగులతో అదరగొట్టారు. అనంతరం వేలాదిమంది అభిమానుల నడుమ పద్మభూషణుడు నందమూరి బాలకృష్ణ దంపతులకు హిందూపురం పట్టణం తరపున సీనియర్ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, లేపాక్షి మండలం తరపున రంగారెడ్డి తదితరులు, హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్లు, లేపాక్షి మండల నాయకులు, నందమూరి అభిమానుల సంఘం నాయకులు, టిడిపి నాయకులు, తెలుగు యువత నాయకులు, జనసేన, బిజెపి నాయకులు జ్ఞాపికలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, హిందూపురం మున్సిపల్ చైర్మన్ డి రమేష్ కుమార్, పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వేలాదిమంది అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం

జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ శుభదాసు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పాడి రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందని దాంతో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతోందని శ్రీ సత్య సాయి జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ శుభదాసు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : పాడి రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాలు ఏవీ?

జవాబు: పాడి రైతులను ఆదుకోవడం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. వాటిలో ముఖ్యంగా నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో గొర్రెల పెంపకం, నాటు కోళ్ల పెంపకం ద్వారా రైతులకు సబ్సిడీ రుణాలను అందజేసి ఆదుకుంటోంది. 500 గొర్రెల పెంపకం చేస్తే కోటి రూపాయలు రుణం మంజూరు చేస్తాం. అందులో 50 శాతం సబ్సిడీతో బ్యాంకుల ద్వారా రుణం పొందవచ్చు, ఇదివరకు శ్రీ సత్య సాయి జిల్లాలో కోటి రూపాయల రుణాలను ఐదు యూనిట్లకు మంజూరు చేశాం. రూ.30 లక్షల విలువ జేసే ఎనిమిది యూనిట్లు మంజూరు చేశాం.

ప్ర : పాడి రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాలు తెలపండి.

జ: ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు పశుగ్రాసం పెంపకానికి ఎకరాకు రూ. 33 వేల రూపాయలు అందజేస్తుంది. ఇప్పటిదాకా జిల్లాలో 12 వేల ఎకరాలు పశుగ్రాసం పెంపకం జరుగుతోంది. మరింత మంది రైతులు ముందుకు వస్తే వారికి కూడా అవకాశం కల్పిస్తాం. శైలేజి పాతర గడ్డి పెంపకంపై దృష్టి పెడుతున్నాం. ఈ గడ్డిలో ఉండే అధిక పోషకాలు పాడి పశువులు ఎక్కువ పాల ఉత్పత్తిని అందించడమే కాక ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

ప్ర : పాడి పశువుల సంతానోత్పత్తి. అధిక పాలు దిగుబడికి చేస్తున్న తీసుకుంటున్న చర్యలు ?

జ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు తీవ్ర కరువు బారిన పడినందున అడ లేగ దూడలు మాత్రమే పుట్టే విధంగా శమన అనే కార్యక్రమం చేపట్టాం. దీని ద్వారా సంతాన ఉత్పత్తిలో ఆడ దూడలు మాత్రమే జన్మించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. శ్రీ సత్య సాయి జిల్లాలో ఉచితంగా 6 వేలు డోసులు అందించనున్నాం. ఇవి ఇదివరకే కదిరి, నల్ల చెరువు ,తనకల్లు ,తలుపుల మండలాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని ఇతర జిల్లాలలో ఒక్కొక్కటి 500 రూపాయలు చెల్లించి వేయించుకోవాల్సి ఉందని కానీ సత్యసాయి జిల్లాలో ఉచితంగా అందిస్తున్నాం. సంతాన ఉత్పత్తి ఇంజక్షన్ ద్వారా కచ్చితంగా పెయ్యదూడలే జన్మిస్తాయి. దానివలన జిల్లా వ్యాప్తంగా పాడి పశువుల అభివృద్ధి ఊపందు కుంటుంది.

ప్ర : పాడి రైతుల కొరకు చేస్తున్న కార్యక్రమాలు.

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా అధిక పాల దిగుబడి సాధించడం కోసం పాడి రైతులకు అతి తక్కువ ధరతో పోషకాలతో ఉన్న దానాను అందజేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా పది లారీలు దానా ను రైతులు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 32 మండలాల్లో ఒక్కో మండలానికి 250 మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తాం. ధర్మవరం డివిజన్లో తొమ్మిది మండలాలకు 75 మెట్రిక్ టన్నులు. పెనుగొండ 12 మండలాలకు 10 మెట్రిక్ టన్నులు, హిందూపురం 11 మండలాలకు 75 మెట్రిక్ టన్నులు అలాట్‌మెంట్ చేశాం. త్వరలో దాణా రానుంది. సబ్సిడీ పోను కేజీ ఐదురూపాయల యాభైఐదు పైసలు రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు 50 కేజీల బస్తా 555రూపాయలకు అందజేయనున్నాము. దీనిని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలి.

జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ శుభదాసు

పశువుల పాక కాదు.. అంగన్వాడీ భవనం..

అంగన్వాడీ భవనం ముందు ఎట్టేసిన ఆవు, ఎనుము

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇక్కడ ఆవు కట్టేశారు.. పశువుల పాక అనుకునేరు.. పశువుల పాక కాదు.. అంగన్వాడీ భవనం.. మండలంలోని గోవిందవాడ దళితవాడలో ఉన్న అంగన్వాడీ భవనం ముందు ఇలా స్థానికులు ఆవు, ఎనుములను కట్టేస్తుండటంతో చిన్నారులు, తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి అంగన్వాడీ భవనం ముందు పశువులను కట్టేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

నకిలీ ఆర్ఎంపిలపై చర్యలు తీసుకోవాలి

బిసివై పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌనిప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

పేదల ప్రాణాలకు కారకులు అవుతున్న నకిలీ ఆర్ఎంపి వైద్యులపై చర్యలు కోవాలని భారత చైతన్య యువజన పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గౌని ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బిసివై పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద ఉన్న మూసా క్లినిక్‌లో 40 రోజుల క్రితం నకిలీ ఆర్ఎంపి చేతుల్లో ఓ చిన్నారి మృతి చెందిన విషయం మరువకముందే పైతోటకు చెందిన బోయ పార్వతమ్మ శనివారం అదే మూసా క్లినిక్ ఆర్ఎంపి వైద్యుడి వైద్యం వికటించి మృతిచెందడం బాధాకరమన్నారు. అయితే విషయం బయటకు పొక్కకుండా బేరసారాలకు దిగుతున్నాడని ఆరోపించారు. ఇది ముమ్మాటికి జిల్లా వైద్య అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. నకిలీ ఆర్ఎంపి చేతుల్లో పేదలు ప్రాణాలు కోల్పోతున్నా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిఎంహెచ్ఒను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న గౌనిప్రతాప్‌రెడ్డి

ఆర్డీటీ ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) ఫారిన్ కంట్రిబ్యూటరి రెగ్యులేటరి యాక్ట్ (ఎఫ్‌సిఆర్ఎ)ను వెంటనే పునరుద్ధరించాలని వికలంగుల బాలాజీ సమైక్య నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని ఆర్డీటీ కార్యాలయంలో మాంఛూ ఫెర్రర్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 50ఏళ్ల నుంచి నిరుపేదలకు సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్ఎను రెన్యూవల్ చేయకపోవడం బాధాకరమన్నారు. విదేశాల నుంచి దాతల విరాళాలు రాకపోతే సంస్థ నుంచి పేదలకు అందే సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. కావున వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యంగుల అధ్యక్షులు వసంతకుమార్, కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షులు ఉద్దీప్ సింహ, రూరల్ అధ్యక్షులు దొనస్వామి, దివ్యాంగుల సానుభూతిపరులు శంకర్, ప్రసాద్, దయనిది పాల్గొన్నారు.

మాంఛూఫెర్రర్‌తో మాట్లాడుతున్న వికలాంగుల సంఘం నాయకులు

గౌస్‌మోదీన్ మరిన్ని పదవులు అలంకరించాలి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిరాయతి గౌస్‌మోదీన్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు. గౌస్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని గౌస్ కార్యాలయం వద్ద కేక్ కోసం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీలో గౌస్ కు పేరు ఉందన్నారు. బాలకృష్ణ అభిమానిగా సేవా కార్యక్రమాలు కూడా చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపి బీకే పార్థసారథి, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, నందమూరి అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ డైరెక్టర్ రామచెన్నారెడ్డి మృతి

రామచెన్నారెడ్డికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

వ్యవసాయ శాఖలో సుదీర్ఘకాలంగా నాణ్యమైన సేవలను అందించి అందరి మన్ననలు పొందిన మాజీ డిప్యూటీ డైరెక్టర్ రామచెన్నారెడ్డి (90) ఆదివారం ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారుల సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి మల్లికార్జున, సుబ్బారెడ్డి, చెన్నారాయుడు, విజయ్, రవీంద్రారెడ్డి, కొండయ్య, చెన్నారెడ్డి, విశ్వనాథ్, గురుమూర్తి, విశ్రాంత అగ్రికల్చర్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు రెగ్యులర్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ అగ్రికల్చర్ మినిస్టీరియల్ సిబ్బంది నివాళులర్పించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర కమిటీ ఎన్నిక

నగర అధ్యక్షులుగా రఫీ, ప్రధాన కార్యదర్శిగా వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నగర శాఖ నూతన కమిటీ ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపీకృష్ణ, రామునాయక్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రామునాయక్, సహ అధ్యక్షుడు వేణుగోపాల్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. నూతన అధ్యక్షులుగా ఎం.షేక్ రఫీ (జిల్లా పరిషత్), నగర శాఖ ప్రధాన కార్యదర్శిగా హెచ్.వినోద్ కుమార్ (మెడికల్), ఎస్‌టీ.శ్రీనివాసులు (జిఎస్‌టి), నగర శాఖ సహాధ్యక్షులు జి.నాగార్జున (జిల్లా ఖజానా), కె.సుధాకర్ రావు, (జిఎస్‌టి), ఎం.తిమ్మరాజు (ఆర్,బి), కె.సుధాకర్ (ఆయుష్), ఎల్.శ్రీనివాసులు (జిల్లా పరిషత్), కె.నగేష్ (జిఎస్‌టి), ఉపాధ్యక్షులుగా, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.ఈశ్వరయ్య (ఆర్‌బి), జి.శ్రీనివాసులు (జిల్లా ఖజానా) ఎస్ఐ.పనింద్ర శర్మ (సోషల్ వెల్ఫేర్), శ్రీమతి సుజాత (బీసీ వెల్ఫేర్), జి.పెద్ద రెడ్డయ్య, (పే, అకౌంట్స్) ఏ.శివ శంకరయ్య, ఆర్.మహేశ్వర నాయక్, కె.భగీరథరెడ్డి (గ్రామ వార్డు సచివాలయం), సహాయ కార్యదర్శులు, కోశాధికారిగా మౌలా సాహెబ్ (వైద్య కళాశాల)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ సభ్యులు

సమస్యల పరిష్కారానికి ఐక్యమవుదాం



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ : సమస్యల పరిష్కారానికి వడ్డెర్లు అందరం ఐక్యమవుదామని పట్టణ వడ్డెర్ల సంఘం అధ్యక్షులు సంజీవరాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన వడ్డెర్ల సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సంజీవరాయుడు, ఉపాధ్యక్షులుగా లాలూస్వామి, వి.శివ, ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య, కార్యదర్శి చిన్నబాబు, శివకుమార్, కోశాధికారి గంగరాజు, గౌరవ సలహాదారులు వి.రమేష్, వి.మారెన్న, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సంజీవ రాయుడు మాట్లాడుతూ వడ్డెర్లు ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పొరాళపురుషోత్తం, 9వవార్డు టిడిపి ఇన్‌ఛార్జి పొరాళ గౌరీ ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు స్థానిక సెయింట్ పాల్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విప్ ప్రారంభించారు. ఇందులో భాగంగా 6, 9 ఎన్నికల వార్డులకు సంబంధించిన అనేక మంది కళ్లు, గుండె, ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా జబ్బు చేసినప్పుడో, ఆరోగ్య సమస్య వస్తేనో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటారన్నారు. ఉచిత శిబిరాలు నిర్వహించినప్పుడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సవేరా ఆసుపత్రి వైద్యులు మధు, సందీప్, నిర్వాహకులు ప్రభ, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు కార్యదర్శి ఇనాయత భాష, మున్సిపల్ వార్డు సభ్యురాలు జ్యోతి, పార్టీ నాయకులు ధనార్జన, వెంకటేశులు, జమీల్ ఖాన్ రాజశేఖర్, సురేంద్ర, సవేరా ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులకు కూలిన మండలంలోని కొర్రపాడు గ్రామంలో రైతు రవికి చెందిన కోళ్లషెడ్డును ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతున్న రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతోపాటు పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా శిథిలావస్థకు చేరిన ఇళ్లు, భవనాలు, కార్యాలయాలు ఉంటే తెలుసుకోవాలన్నారు. అలాగే ఎక్కడైనా ఒంగిన, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంబాలు గుర్తించి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాన్నారు. ఎక్కడైనా పంట నష్టం జరిగితే వివరాలు సేకరించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ సొలమన్, హెచ్ఒ శైలజ, నాయకులు మల్లేష్, ఓబుళపతి, తదితరులు పాల్గొన్నారు.

కూలిన కోళ్ల షెడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బిటిపి కుడికాలువకు నీటి పారుదలను కొనసాగించండి

ప్రాజెక్ట్ వైస్‌ఛైర్మన్ ఎన్.సుభాన్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

భైరవానితిప్ప ప్రాజెక్టు కుడి కాలువకు నీటి పారుదలను కొనసాగించాలని ప్రాజెక్టు వైస్‌ఛైర్మన్ ఎన్.సుభాన్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని బుడిమేపల్లి గ్రామం నుంచి వేపులుపర్తి వరకూ రైతులు సాగు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం, రాయదుర్గం తాలూకా పరిధిలో రబీ సీజన్‌లో బిటిపి కుడికాలువ కింద 12 కిలోమీటర్ల మేర దాదాపు 9 గ్రామాల్లో సాగునీటి సౌలభ్యం ఉందన్నారు. ఈ సౌలభ్యంతో 1725 ఎకరాలకు నీటిని గతేడాది డిసెంబర్‌లో విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీ నాటికి నీటి విడుదల కాలం ముగిసిందన్నారు. అయితే చాలామంది రైతులు ఆలస్యంగా వరినాట్లు వేయడం వల్ల పంట ఇంకా కోత దశకు రాలేదన్నారు. ఈ సమయంలో నీటిని బంద్ చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం రైతుల బాధలు విన్న సుభాన్ అక్కడి నుంచే ఫోన్‌లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో సమస్యను చర్చించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యను కలెక్టర్ వినోద్‌కుమార్‌తోపాటు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేకు సుభాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిసి మెంబర్లు, మాజీ మండల కన్వీనర్ వెంకటేశులు, మాజీ సర్పంచు హనుమంతప్ప, డీలర్ పెన్నప్ప, మాజీ స్కూల్ కమిటీ ఛైర్మన్ మాంతేష్, తదితరులు పాల్గొన్నారు.

కాలువను పరిశీలిస్తున్న బిటిపి వైస్‌ఛైర్మన్ ఎన్.సుభాన్

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

పుట్లూరు : తెగిపడిన విద్యుత్ లైన్‌ను ఎట్టకులకూ అధికారులు మరమ్మతులు చేపట్టారు. 'తెగిపడిన విద్యుత్ లైన్.. పట్టించుకోని అధికారులు' అంటూ ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు ఆదివారం తెగిన వైర్లకు మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

కరెంట్ లైన్‌ను సరి చేసిన దృశ్యం

గుత్తి ఆదర్శ కళాశాల వద్ద పోలీసు బందోబస్తు

ఎపిపిఎస్‌సి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలో వేర్వేరుగా జరుగుతున్న ఎపిపిఎస్‌సి, గ్రూప్-1 మెయిన్స్, నీట్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద డిఎఫ్ ఎమ్ డిలు, హెచ్ ఎఫ్ ఎండిలు ల ద్వారా చెక్ చెసి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి పంపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకున్నారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేకుండా క్షుణ్ణంగా చెక్ చేసి పంపారు.

ఎంఎస్ రాజును కలిసిన టిడిపి నాయకులు


రాజుకు బొకే అందజేస్తున్న దేగల, చంద్రాయుడు

శింగనమల : మడకశిర ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) బోర్డు సభ్యులు ఎంఎస్ రాజును మండల టిడిపి నాయకులు ఆదివారం కలిశారు. రాజు పుట్టిన రోజును పురస్కరించుకుని బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, మాజీ ఎంపిటిసి చంద్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును మండల టిడిపి నాయకులు ఆదివారం కలిశారు. రాజు పుట్టిన రోజును పురస్కరించుకుని బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో టిడిపి మండల కార్యనిర్వహణ కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

రాజుకు బొకే అందజేస్తున్న పుట్లూరు మండల నాయకులు

విద్యావ్యవస్థలో లోపాలను సవరించాలి

అనంతపురం కలెక్టరేట్ : విద్యా వ్యవస్థలో అసంబద్ధ విధానాలు ప్రభుత్వ వీడాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో అసంబద్ధ విధానాలను వ్యతిరేకంగా ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 5న పాత తాలూకా కార్యాలయం, 9న కలెక్టరేట్, 14న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ తన తమ్ముడు, రామన్న, సతీమణి అరుణ, కుమార్తె తనూజా వారి సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుబ్రహ్మణ్యం, నబి రసూల్, శివయ్య, పాపయ్య, లక్ష్మీనారాయణ, మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

నేత్ర దానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గుండెపోటుతో మృతి చెందిన భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ హరి (38) కళ్ళను ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో దానం చేశారు. డివై.కుళ్లాయప్ప డివై.కుళ్ళయప్ప ఐ రిట్రైవల్ సెంటర్ (ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ) వారికి హరి రెండు కళ్ల దానం చేశారు. మరణం అనంతరం ఇతరులకు చూపు కల్పించే అవకాశం నిర్ణయం చేసిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వాలంటీర్ బాలకష్ణ, భాస్కర్, హరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కళ్లను అందజేస్తున్న ఆటో డ్రైవర్ హరి కుటుంబ సభ్యులు

నాట్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : నగర శివారులో ఉన్న శిల్పారామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నారు. వారంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నితిన్‌రాజ్ డ్యాన్స్ స్టుడియో, డాన్స్ మాస్టర్ నితిన్ బృందం నృత్య ప్రదర్శనలు చేసినట్లు శిల్పారామం పరిపాలన అధికారి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు.

5న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో ఈనెల 5వతేదీన నిర్వహించనున్న ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని చెరువు కట్ట వద్ద ఉన్న సాయిబాబా కళ్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవాలని కోరారు.

7న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

శింగనమల : మండల కేంద్రంలోని శింగనమల చెరువు కట్ట మీద వెలసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం ఈనెల 7వతేదీన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరాధన మహోత్సవంలో చుట్టుపక్కర గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కూలీలతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్

పెద్దపప్పూరు : వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని చాగల్లు ప్రాజెక్టు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, బొలేరో వాహనాలు అధిక మంది కూలీలతో వెళ్తుంటారన్నారు. నిబంధనలను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరిపొలాల పరిశీలన

శింగనమల : ఇటీవల కురిసిన గాలివానకు నేల వాలిన వరిపంటను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. దెబ్బతిన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు అంద జేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో తాతయ్య, ఎంపిఇఒ ఉమాదేవి, శింగనమల రంగరాయల చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ బోయ సత్యనారాయణ, ఎం.ఆదినారాయణ, చాకలి వెంకటేష్, ముంతా వెంకటేష్, రైతులు, పాల్గొన్నారు.

వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీని కలిసిన అపుస్మా నాయకులు

ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న అపుస్మా నాయకులు

అనంతపురం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జి.శ్రీనివాస నాయుడును ఆదివారం అపుస్మా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ప్రయివేట్ పాఠశాలల సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర కోఆర్డినేటర్ కె.పుల్లారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు నాయుడు, జిల్లా అధ్యక్షులు కె.సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ ఎస్.రవిశంకర్‌ప్రసాద్, రాష్ట్ర నాయకులు ఎం.నాగరాజు, జిల్లా అడ్వైజర్ మహ్మద్ ఇక్బాల్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ముంటిమడుగు, నెట్టెం

ఎంపికి బొకే అందజేస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ నెట్టం వెంకటేష్

అనంతపురం : అనంతపురం ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ నెట్టం వెంకటేష్ ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

జూదరుల అరెస్టు

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రాయదుర్గం : పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డులో పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసి రూ.75,840 నగదు, 10 సెల్‌ఫోన్లు, ఏడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ తెలిపారు. మొలకాల్మూరు రోడ్డు సమీపంలోని ఓ తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు దాడి చేసి నిందితులను పట్టుకోవడంతోపాటు పేక ముక్కలు, నగదు, సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దేవరకొండ వద్ద దారి దోపిడీ

బుక్కరాయసముద్రం : మండల కేంద్రం సమీపంలోని దేవరకొండ వద్ద దారి దోపిడీ జరిగింది. సిఐ పుల్లయ్య తెలిపిన వివరాల మేరకు.. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి నారాయణస్వామి గొర్రెలను కొన్న డబ్బులను తీసుకువెళ్తుండగా దేవరకొండ సమీపంలోని రాగానే గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు. దీంతో నారాయణస్వామి వద్ద ఉన్న రూ.6.80లక్షల సొమ్మును దోచుకున్నారు. అనంతరం నారాయణస్వామి 100కు కాల్ చేసి సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఇటుకులపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దారి దోపిడీకి గురైన నారాయణస్వామి